# మరువలేని కేసు

"అర్జెంట్ కేస్ - వేగిరం రావా"

నిల ఫోను రాగానే డ్రస్ అయినా మార్చుకోకుండా మెంటల్ హాస్పిటల్‌కి టికట్ ఇవ్వమని బస్సులో కూర్చున్నాను. మెంటల్ హాస్పిటల్‌కి టికెట్ అనగానే నా వేషం, రూపు చూసి 'మీకొక్కరికేనా సార్!' అంటూ కండక్టర్ నాదగ్గరకివచ్చాడు. క డక్టర్ ఏ ఉద్దేశ్యంతో అడిగేడో గ్రహించి నే నక్కడ పనిచేస్తున్నానని చెప్పాను, పేషెంటుని కానని బోధపడేటట్లుగా. కండక్టర్ తనేదో పొరపాటు చేసినట్టుగా 'అదికాదు సార్. మీ స్నేహితు లెవ్వరయినా మీతో వచ్చారేమోనని అలా అడిగాను' అని టికెట్టు, తక్కిన చిల్లర నా చేతులో పెట్టాడు.

హాస్పిటల్‌కి రాగానే వార్డు బోయ్ రంగప్ప గేటు దగ్గర కనపడ్డాడు. 'మీ కోసమే పేషెంట్సు బంధువులు వెయిట్ చేస్తున్నారుసార్. కేసు సూసైడల్ టెండన్సీస్ విత్ డిప్రెషన్‌లాగ వుందిసార్' అన్నాడు, తన అనుభవంలోవిన్న నాలుగు ఇంగీషు మాటలు దొర్లిస్తూ.

రంగప్పకి వార్డు 'బాయ్' అన్న పేరు గవర్నమెంటు వాళ్ళిచ్చినదే కాని, సర్వీసే ముప్ఫైఏళ్ళు ఉంటుంది. రంగప్ప డాక్టరుగా కాకపోయినా తన ముప్ఫైయేళ్ళ సర్వీస్‌లో చూసినన్ని కేసులు నా కన్నా ఏ సీనియర్ డాక్టరుకూడా చూసి వుండరేమో! ఐదారు భాషలు క్షుణ్ణంగా వచ్చు. ఎవ్వరితోటి చెడ్డనిపించుకోడు. డాక్టరు కొత్తవాడైనా చాలా మర్యాదగా చూసేవాడు. ఈ కొత్త డాక్టరుకేం తెలుసు అని గర్వంగా వుండే సీనియర్ నర్సులచేత కూడా ఆ మర్యాద ఇప్పించేవాడు.

నేను డ్యూటీ రూము కెళ్ళేసరికి పేషెంటుని నలుగురయిదుగురు పట్టుకొన్నారు, ఆవేశంగా ఊగుతోంది పేషెంటు అన్నయ్య ఇంగ్లీషులో ఊరూ, పేరూ చెపుతున్నాడు. తను ఇంజనీరుగా ఆ ఊరిలోనే పనిచేస్తున్నానని చెప్పి, పేషెంటుకి గార్డియన్‌గా తన చిరునామా ఇచ్చాడు. పేషెంటు తనకి చెల్లెలని, ఆవిడభర్త పెళ్ళాడిన రెండేళ్ళలోనే పోయాడని, భర్తపోయిన దగ్గర్నుంచి తన దగ్గరే ఉంటున్నాదని, ఇంట్లో వాళ్ళం

దరూ మరి కనిపెట్టలేక విసిగిపోయా రనీ చెప్పాడు.


మూడేళ్ళయి ఎన్నోసార్లు ఆత్మహత్యకి ప్రయత్నించి ప్రయత్నించి అన్నిసార్లూ పట్టుబడి పోయిందంటే నాకొంచెం ఆశ్చర్యం కలిగింది. జయలక్ష్మిని పట్టుకొన్న వాళ్ళందర్నీ పేషెంట్ తో మాట్లాడాలని పైనకూర్చోమన్నాను. పేషెంటుని పేరుతోనేపిలిచి కూర్చోమన్నాను.

జయలక్ష్మి అంత ఆవేశంలోనూ ఊగుతూ నా ఎదురుగా కూర్చుంది. బట్టలన్నీ చెమటతో తడిసిపోయి వున్నాయి. హాస్పిటల్ కాంటీన్ నుంచి రంగప్పచేత కాఫీ తెప్పించి ఇచ్చాను. ఈలోగా నా అసిస్టెంట్ డాక్టర్ మూర్తి రంగప్ప ఫోను అందుకొనివచ్చి నా పక్కనే కూర్చున్నాడు. కేసు గురించి నాకు చెప్పినమాటలే మూర్తికి చెప్పినట్టు వుంది. అంచేత నన్నేం అడగకుండా ఏవో కేసు రికార్డులు చూసుకుంటున్నాడు. జయలక్ష్మి కాఫీ తాగడం పూర్తిచేసింది.

మనిషిలో ఆవేశంకొంతవరకుతగ్గినట్టు కనిపించింది. మీ పేరేమిటని అడిగి జయలక్ష్మి సమాధానంకోసం ఎదురు చూస్తున్నాను. 'నిజంగా మీరు మెంటల్ హాస్పిటల్ లో ఉండవలసిన డాక్టర్లే సార్, లేకపోతే ఇప్పుడే మా అన్నయ్య చెప్పాడు, రికార్డులో రాసుకున్నారు. ఆ పేరుతోనే పిలిచారు, మళ్ళా అడుగుతున్నారు?' అన్న జయలక్ష్మి మాటలకి అంతవరకు ఏవో కేసు రికార్డులు చూసుకుంటున్న మూర్తికూడా తలయెత్తి ఆశ్చర్యంగా జయలక్ష్మి వేపు చూశాడు. సర్దుకోడానికి 'మీ అన్నయ్య చెప్పింది నిజమేనా అని అడిగా'నన్నాను. 'పేరుకూడా అబద్ధమే చెప్తాడా అన్నయ్య? మరి ఆ సందేహంవుంటే మీరు రికార్డులో ఎందుకు రాసుకుంటారు ? లేకపోతే మీ రికార్డులో అబద్ధాలేతప్ప నిజం రాయరా ?' అంది.

ఈ వింత సమాధానాలు ముప్ఫై ఏళ్ళ అనుభవంవున్న రంగప్పనే చిత్తుచేసి నట్టున్నాయి. నన్నే దోరక్షిద్దామని.

'అదికాదు అమ్మా 'ఆత్మహత్యకి మూడేళ్ళయి మీరు ప్రయత్నించటం నిజమేనా అని డాక్టరుగారడుగుతున్నారు' అన్నాడు. 'చచ్చినవాడికళ్ళు చారడేసిఅని విఫలం ఐన ప్రయత్నాలకి మూడేళ్ళయితేనేం, ముప్ఫై ఏళ్ళవుతేనేం? నన్ను ఆత్మహత్య చేసుకొని హాయిగా బతకనివ్వని దానికి ఈ అనవసర ప్రశ్నలుకూడా ఎందుకు?' అని, మీ హాస్పిటల్ కితెచ్చి పడేశారు, మీ పని మీరిక కానివ్వండి అన్నట్టు నా వేపు చూసింది జయలక్ష్మి. ఎంత పెడసరంగా మాట్లాడినా జాలేకాని




కోపం రాలేదు. మనిషిని చూసిన వెంటనే ఇంత అందమైనదానికి ఇంత చిన్న వయస్సులో వైధవ్యం రావడంగొప్పఅన్యాయం అనిపిస్తుంది.

ఇకఏప్రశ్న వేస్తే జవాబువస్తుందా అని ఆలోచిస్తున్నాను. ఈ లో గా డాక్టరు మూర్తి కుర్చీలోంచి లేచి తనతోకూడా రమ్మన్నట్లుగా సంజ్ఞ చేసేడు. గదిలో మూలకి తీసుకెళ్ళి "సార్ ఈ పేషెంటునుంచి ఇన్ఫర్ మేషన్ ఏ మీ దొరికేటట్టు లేదు. పేషెంటులో సూసైడల్ టెండెన్సీసూ

బాగా వున్నాయి. ట్రీట్‌మెంట్‌కి వెంటనే ప్రొసీడ్ అవ్వడం మంచిదని పిస్తోంది. లేకపోతే పేషెంటుని బతికించడం కష్టమేమో! మీ ఉద్దేశం ఏమిటో చెప్తే షాక్ ట్రీట్‌మెంటు ఇద్దాం' అన్నమూర్తి మాటలకి నేను సరే అన్నాను. నిమిషాలమీద నర్సులకిచెప్పి రంగప్ప అన్నీ సిద్ధం చేయించాడు. పెద్ద గొడవేమీ లేకుండా షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడంజరిగింది.


జయలక్ష్మినికనిపెడుతుండమని నర్సులకి, అవసరమైతే ఫోను చెయ్యమని రంగప్పకిచెప్పి నేనూ, మూర్తి బయలుదేరాం. చేత్తో గేటు తలుపులుమూస్తూ, నోటితోనే నమస్కారాలు చెపుతూ "పేషెంటు చాలా తెలివైంది సార్, బి. ఏ. పాసయ్యిందట" అని రంగప్ప మమ్మల్ని సాగనంపాడు.

స్వతంత్రం రాకముందు ఇంగ్లీషు హయాంలో బి. ఏ. మీద ఉన్న మోజు ఉండిపోయిందో, లేకపోతే అంతకన్నా పై చదువు లేదనే ఉద్దేశమో ఏమోకాని రంగప్పకి బి. ఏ. అంటే గొప్ప మోజు. దేవుడు ప్రత్యక్షంఅయి నీకేం కావాలో కోరుకో అంటే హెూమియోపతి కంపెనీ వాళ్ళ చేతనైనా బి. ఏ. ఇప్పించమంటాడు. ఎమ్. ఎ. పి. హెచ్‌డి. వాళ్ళనికూడా బి. ఏ, పాసయ్యావాఅని అడుగుతాడు. నేను హాస్పిటల్‌లో చేరిన కొత్తలో "మీారు బి. ఏ. పాసయ్యారా" అని అడిగాడు. లేదని చెప్పేసరికి, పేకాటలో ఎప్పుడూ పట్లుపట్టిక, మూడాసులు పట్టేసరికి ఒక్క నయాపైస కూడా వేయకుండా అందరూ పట్లొదిలేస్తే పెట్టేమొహం పెటాడు. ఆఖర్ని ఉండబట్టలేక నన్నోసారి అడిగేసేడుకూడా మీ డాక్టర్లెవ్వరూ బి.ఏ.పాసవ్వరాఅని. ముప్పై ఏళ్ళు ఇక్కడ పనిచేసినందుకు వీడికి బి. ఏ. పిచ్చి బాగా పట్టుకుందని నేనేమీ సమాధానం చెప్పడానికికూడా ప్రయత్నించలేదు.

మర్నాడు హాస్పిటల్‌కి రావడంతోనే జయలక్ష్మి ఉన్న వార్డుకి వెళ్ళాను. అక్కడున్న నర్సుని అడిగేను జయలక్ష్మి ఎలా ఉందని. గదిలో మూల కూర్చొని ఏదో ఆలోచించుకుంటున్నాదని చెప్పింది. కేసులు ఎగ్జామిన్ చేస్తున్న డాక్టరు మూర్తిని డిస్టర్బ్ చెయ్యకుండా వార్డ్‌లో కేసులు చూసుకుంటూ జయలక్ష్మి రూముకి బయల్దేరేను.

అందరూ రోజూ చెప్పేమాటలే చెప్తున్నారు, అడిగే ప్రశ్నలే అడుగుతున్నారు. ఏభై ఏళ్ళ ఆడది తను ఇరవై ఏళ్ళయి గర్భంతో ఉన్నానని, తన గర్భంలో ఉన్న పిల్లడికి ఇప్పుడు ఇరవైఏళ్ళని పక్కవాళ్ళతో చెప్తున్నాది. ఆమాటలు వింటూ వాళ్ళని దాటేసరికి ఇంకో ఇద్దరు నా వెంటపడ్డారు. ఒకరు తనిచ్చిన

మూడు కోట్ల రూపాయల చెక్కుకి స్టేట్ బ్యాంక్ వాళ్ళు డబ్బు పంపారని, మరొకరు సావిత్రి తన పేరు పెట్టుకొని, తన ఏక్షన్స్ చేసి ఆర్జించిన డబ్బు కోర్టు వాళ్ళు తన కెప్పుడిప్పిస్తారని అడుగుతున్నారు.



ఈ పద్మవ్యూహం అంతా దాటి జయలక్ష్మి రూముకి చేరుకున్నాను. ఆలోచనలు ఆపి జయలక్ష్మి నిలబడింది మనిషి ఇంకా మామూలుస్థితికొచ్చినట్టు కనిపించలేదు. నర్సుని పిలిచి 'సేమ్ ట్రీట్ మెంట్' కంటిన్యూ చెయ్యమన్నానని డాక్టరు మూర్తితో చెప్పమన్నాను. ఐదారు రోజులు ట్రీట్ మెంట్ తరువాత జయలక్ష్మిలో ఆవేశం తగ్గిందనిపించింది.

జయలక్ష్మిని నా దగ్గరకి పంపమని నర్సుకి చెప్పి ఇంటర్వ్యూ రూములో కూర్చున్నాను. నా ఎదురుగా జయలక్ష్మి కూర్చుంది. మొహం ప్రశాంతంగా ఉంది నేను మాట్లాడ్డం ప్రారంభించేను. 'చూడండి బ్రతుకు దేముడిచ్చిన వరంలాంటిదంటారు. పుట్టాలని మనం పుట్టలేదు కాబట్టి, చావాలనుకున్నప్పుడు

చావడానికి మన కధికారం లేదేమో! మీకు జీవితంలో వచ్చిన కష్టాల్ని నే నర్థం చేసుకోగలను. కాని మూగి, చెముడు, గుడ్డి అయిన హెలెన్ కెల్లర్‌తో పోల్చిచూస్తే మీవో కష్టాలనుకోను. అలాంటి వాళ్ళు ప్రపంచంలో చాలా మంది ఉన్నారు.

ఇంతకీ మీ ఆత్మ హత్యా ప్రయత్నాలకి కారణం ఒక్క భర్త మరణమేనా? ఇంకేమైనా కారణా లుంటే నాతో చెప్పుకోడానికి ఏం సందేహించకండి" అన్నాను.


జయలక్ష్మి నోరు విప్పింది. ఏం చెప్తుందో విందామని ముందరికి వంగాను. "అయితే వెర్రివాళ్ళకి కూడా ఆత్మహత్యకి కారణాలుంటాయా?" అంది. ఇక లాభం లేదనుకున్నాను. ఆవేశం అంటే తగ్గింది కాని పెడసరం మాటలు చెప్పే స్వభావం ఏం మారలేదు. జయలక్ష్మిని ఏమైనా అడిగితే ప్రశ్నలే కాని జవాబులు రావని పించింది. ఇన్నేళ్ళ నా అనుభవంలో డాక్టర్ల నేడిపించే పేషెంట్లలో జయలక్ష్మి మొదటి దనిపించింది.

ఇంతలో మూర్తివచ్చి "మీ సైకాలజీ పాఠాలు ఎంతవరకు వచ్చాయి సార్" అన్నాడు. "మరికొన్ని రోజుల ట్రీట్‌మెంట్ తరువాత కాని పేషెంటుకి మనం చెప్పే మాటలు తల కెక్కవేమో" అని మూర్తిని పైకి తీసికెళ్ళి చెవిలో చెప్పాను. "అలాగే సార్" అని మూర్తి వెళ్ళిపోయాడు. జయలక్ష్మిని తన రూముకి పంపించి వద్దామని నర్సుని పిలవబోయాను.

ఇంతలోనే ఎలా తప్పించుకుందో కాని ఓ పేషెంటు పరుగెత్తుకొని వచ్చి నా కాలర్ పట్టుకొని జోరుగా కేకలేస్తూ, తిడ్తూ కొట్టడం ప్రారంభించింది. బలిష్ఠురాలవడంవల్ల పేషెంటుని ఆపడం నా ఒక్కడితరం కాలేదు. కూర్చున్న జయలక్ష్మి లేచి, తనుకూడా పేషెంట్‌ని పట్టుకొని నౌకర్లని, నర్సుల్ని కేకలు వేసింది. ఈ కేకలకి నౌకర్లు, నర్సులు పరుగెత్తుకొని వచ్చి నేనేం తిడతానోనని భయపడి పోతూ పేషెంటుని తీసుకుపోయారు. నౌకర్ల నిర్లక్ష్యంవల్ల పేషెంట్లచేత అప్పుడప్పుడు దెబ్బలు తినడం మామూలే అయినా ఈసారి తిన్న దెబ్బలకి కళ్ళు తిరిగాయి. సర్దుకునే సరికి ఐదునిమిషాలు పట్టింది. కళ్ళు విప్పేసరికి జయలక్ష్మి నావేపు సానుభూతిగా చూస్తూన్నట్టు కనిపించింది.

"థేంక్సు" చెప్పి జయలక్ష్మిని రూముకి చేర్చడానికి నర్సుని కేక వేయబోయాను. "అక్కర్లేదండి. నేను వెళ్ళగలను, మీ థేంక్సు కాదుగాని మీ రెందుకి డిపార్టుమెంటులో చేరారండి? జీవితం అంతా దెబ్బలుతింటూ, సైకోథెరపీ పేర నీతులు చెప్తూ ఇక్కడ ఇన్ని

బాధలు పడేకన్నా ఇంకేహాస్పిటల్ లోనయినా పని చేసుకోకూడదండీ? హాయిగా సుఖపడతారు" అని తన రూముకి బయలేరింది. అంత బాధలోనూ నాకనిపించింది: జయలక్ష్మికి వెర్రికే ట్రీట్‌మెంట్ ఇవ్వవలసిన అవసరం ఏమైనా ఉందా? లేక పలుమార్లు ఆత్మహత్యా ప్రయత్నం సైన్సు ప్రకారం మెంటల్ డిసీజ్ కిందికి వస్తుంది కనుకనే ట్రీట్ చేస్తున్నామా అని.




జయలక్ష్మి వెళ్తూ అన్నమాటలు విన్నాక నేను ఛార్జెస్ తీసుకోబోతున్నప్పుడు సూపరింటెండెంట్ చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి:

"చూడూ నువ్వుకుర్రాడివి, సర్జరీ కాని మెడిసిన్ కాని ఇంకేలైనులో ఉన్న మంచి భవిష్యత్తు ఉంటుందేమో? ఈ లైనులో పనిచెయ్యడానికి నువ్వు చాలా బాధలుపడాలి, పడ్డబాధలకి ప్రతిఫలంకూడా ఏమీ ఉండదు.

మామూలు విరేచనాలు, వాంతులు తగ్గించే కంపౌండరుకు దక్కే మర్యాదకూడా దక్కదు. ప్రాణం రక్షించాడని ఆ కంపౌండరుని పొగిడేవాళ్ళు ఒకరిద్దరేనా ఉంటారు. కాని ఇందులో బాగుపడ్డ వెర్రివాళ్ళు నీ ఎదుట పడ్డానికి సిగ్గుపడ్తారు, పదిమందితో వెళ్తూ నిన్ను చూస్తే నువ్వెవరో తెలియనట్టు ఉండడానికే ప్రయత్నిస్తారు. నా వెర్రి ఈ డాక్టరు బాగుచేసేడని పదిమందితో చెప్పుకోరు. కొంతమంది ఇంట్లో వెర్రివాడెవడైనా ఉంటే వాడి బాధ వదిలించుకోడానికి మన కప్పజెప్పేసి చేతులు దులుపుకొని పోతారు. ఈ హాస్పిటల్‌లోనే కొందరు పేషెంట్లు ఏ పది, పదిహేనేళ్ళయ్యో ఉన్నారు. వాళ్ళు బతికారా, చచ్చారా అని అడగడానికైనా, వాళ్ళ వాళ్ళెవరూ రారు. ఈ జబ్బు కొంతవరకు కన్నతల్లి, కట్టుకున్న పెళ్ళాంకూడా ఆదరించ

లేనిది. వీక్షణాన తిట్లు. దెబ్బలు తినవలసివస్తుందోనసే భయం వల్ల దూరంగానే ఉంటారు,


ఈ నా ముప్పైవేళ్ళ అనుభవంలో చాలామంది పేషెంట్లచేత దెబ్బలు తిన్నాను. నాతో చదువుకున్న వాళ్లు వేరే లైనులో వుండి బోలెడంత పలుకుబడి, డబ్బూ సంపాదించుకున్నారు. కాని నేను విచారించను. ఆత్మస్తుతేఅనుకో, మరేమైనాఅనుకో. నా జీవితంలో నే నేదో చాలామంది చెయ్యలేని మంచిపని చేసేనని గర్వపడుతుంటాను. పదిమందికి తెలిసేటట్లు చేసే దానంలోకన్నా, గుప్త దానంలోనే నా కెక్కువ సంతృప్తి ఉంటుంది. నీదికూడా నా లాంటి మన స్తత్వమే అయితే ఇందులో చేరు. లేకపోతే డబ్బూ, పేరూ రెండూ దక్కే మెడిసిన్‌లోకాని, సర్జరీలోకాని చేరు. బాగా ఆలోచించుకో, ఛార్జెస్ తీసుకోడానికి నీకొచ్చవలసినంత కెమిస్ట్రాన్సు' అని నేనేమైనా చెప్తానేమోనని ఆగారు.

అన్నీ ఆలోచించుకొని తక్కిన వన్నీ వదులుకొనే వచ్చాననిఛార్జెస్ తీసుకున్నాను.

మొదట్లో అదేదో కొత్త ప్రపంచంలో ప్రవేశించి నట్టయింది. మానవ స్వభావంలో ఎన్ని వింత మనస్తత్వాలు ఉంటాయో, అవి ఎన్ని రకాలుగా మారుతుంటాయో చూడగానే పనిలో శ్రద్ధ కలిగింది. వాళ్ళందరినీ చూస్తే ఏ పాపం ఎరుగని అమాయకుల్ని దేశంలోంచి బహిష్కరిస్తే 'శరణు' అంటూ వచ్చిన వాళ్ళలా కనపడ్డారు. అప్పుడప్పుడూ ఈ పనిమీద, వీళ్ళమీద విసుగుకూడా కలిగేది. కాని సూపరింటెండెంట్ చెప్పినట్టు వీళ్ళని మామూలు మనుషులుగా ప్రపంచంలో తిరిగేటట్టు చెయ్యడానికి ఎన్ని పాట్లుపడ్డా పర్వాలేనంత జాలి కలిగేది. నర్సు పిలవగానే ఆలోచనలు ఆపి పేషెంట్లని చూడ్డానికి లేచాను.

అలా ఆలోచనలతో, పనులతో రోజులు గడుస్తున్నాయి. పదిరోజుల తరువాత మళ్ళీ జయలక్ష్మిని పిలిపించేను. ఏమైనా చెప్పమని నేను మాట్లాడబోయేసరికి నాకన్నా జయలక్ష్మే ముందర ప్రారంభించింది: 'డాక్టరుగారూ సైకో థెరపీ అంటే ఇదే అనుకుంటాను. ఒకటో క్లాసు పిల్లలకి మాష్టరు దొంగతనము చేయరాదని - చెప్పినదే పదే, పదే పదిసార్లు చెప్పినట్టు మీరు కూడా పేషెంట్లకి రోజూ చెప్పిన నీతులే చెప్పడం అనుకుంటాను. అయినా మీకెందుకండీ నా గురించి ఇంత తాపత్రయం ? ఈ సమయం అంతా ఇహ దేనికోసమైనా ఉపయోగిస్తే బాగుంటుందేమో!' అంది.

'చూడండి ఈ తాపత్రయం అంతా




మీరు బతికిబాగుండాలనే. మీరు మంత్రుల ఉపన్యాసాల కింద జమ కట్టుకపోతే రోగి ప్రాణం కాపాడ్డానికి ఏ త్యాగానికైనా సిద్ధమవ్వాలనిపిస్తుంది. మీరెప్పుడూ జీవితాన్ని ఒక్క వేపు నుంచే కాకుండా అన్ని వేపులనుంచి చూస్తే బ్రతకడానికి చాలా ఆశలు, ఎన్నో అవసరాలు కనిపిస్తాయి" అని నేను పూర్తిచెయ్యకుండానే "అయితే రోగి ప్రాణం కాపాడ్డానికి ఏ త్యాగానికయినా సిద్ధమవుతానని గొప్పగా చెప్పుకుంటున్నారు కదా ? నన్ను మీరు పెళ్ళాడ గలరా?" అంది ఛాలెంజ్ చేసినట్టు.

అనుకోని ఈ ప్రశ్నకి వెంటనే జవాబు తోచలేదు. జయలక్ష్మి అన్నట్టుగా గొప్ప కోసమే త్యాగం అని డబ్బా కొట్టుకున్నానేమో నని పించింది. ఏదో ఒక సమాధానం చెప్పకపోతే పెళ్ళి చేసుకోమని పీకలమీద కూర్చుంటుందేమోనన్న భయం వేసింది. అబద్ధం ఆడకపోతే గత్యంతరం లేదు. పెళ్ళయి పోయిందన్నాను, పిల్లలు కూడా ఇద్దరున్నారన్నాను. నా సమాధానాలు విన్నాక కూపీ తీయడానికి అవకతవక ప్రశ్నలతో అల్లరి పెడ్తుందేమోనని భయపడిపోయిననాకుజయలక్ష్మిలో అటువంటి వేమీ కనపడక పోడంతో గండం గడిచినంత సంతోషించాను. వెంటనే అందుకున్నాను.

ఆత్మహత్య ఎంత మహాపాతకమో, బ్రతికి ఎంత సాధించవచ్చో అన్న పాత ఉపన్యాసాలే ఇంకో రెండు మూడు క్రొత్త ఉదాహరణలు చేర్చి చెప్పేను. జయలక్ష్మి బుద్ధిగా వింది అడ్డు ప్రశ్నలు వెయ్యక. నాక్కొంచెం సంతోషం కలిగింది.

రోజూ జయలక్ష్మిని కలుస్తున్నాను. చాలా హుషారుగా మాట్లాడుతోంది. తనే ఆత్మహత్యకి విరుద్ధంగా ఎక్కువ ఉదాహరణలిస్తోంది. జయలక్ష్మిలో హఠాత్తుగా

కలిగిన ఈ మార్పుకి వార్డ్‌లో స్టాఫంతా ఆశ్చర్యపోతూ నా ఎదుటే నన్ను మెచ్చుకుంటున్నారు.

కొన్ని అవాంతర పరిస్థితులవల్ల ఊర్లో లేకపోడంచేత హాస్పిటల్‌కి వెళ్ళడం జరగలేదు. ఊరి నుంచి రాగానే మామూలుగా కేసులు చూసుకోడానికి వార్డుకి వెళ్ళేసరికి జయలక్ష్మి కనపడలేదు. మూర్తి "ఇవాళ సూపరింటెండెంట్‌గారు మీ ట్రీట్‌మెంట్‌ని చాలా మెచ్చుకొని జయలక్ష్మిని డిస్చార్జ్ చేశారు. కంగ్రాచులేషన్స్" అని థేంక్సు కోసం నిరీక్షిస్తున్నట్టుగా మొహం పెట్టాడు.

రెండు రోజుల తరువాత నా పేరన కవరు వస్తే విప్పి చూశాను. రాత కొత్తగా ఉండడంవల్ల ఎవరిదోనని కింద చూశాను. సంతకం జయలక్ష్మి అని కనబడగానే, ఆత్రుతగా చదువుకోడం మొదలు పెట్టాను.

"డియర్ డాక్టరుగారూ,

ఈ ఉత్తరం అందేసరికి బహుశా మీకు మళ్ళా నీతులు ఉపదేశించడానికి, షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడానికి అవకాశం ఉండకపోవచ్చు.

మొదట్లో తెలివితక్కువగా ప్రయత్నించడంవల్ల పట్టుబడిపోయి మీ హాస్పిటల్‌లో చేర్చబడ్డాను. మీ హాస్పిటల్‌లో కొన్నాళ్ళుంటే కాని నాకు జ్ఞానోదయం కాలేదు, నా చావుకి కూడా నేను వేషాలు వెయ్యాలని. అయినా మీరేం చేస్తారు. "లా" అలాంటిది. చచ్చైనా


పిల్లి మార్కు
పాన్ మసాలా పౌడర్
వక్క తమలపాకులలో. ఇది ఒక చిటికెడు వేసుకుంటే ఏలకులు, లవంగములు వగైరా ఏవి అవసరముండదు అన్ని సుగంధ పదార్థములు దీనిలోనే ఉన్నవి. మీ తాంబూలమునకు సువాసన, రుచి ఇచ్చును.




సాంపిల్ వివరములకు వ్రాయండి:
అరోమాటిక్ కెమికల్ అండ్ ఆయిల్ కంపెని
7. సింగన్న నాయిక్ వీధి. మద్రాసు-1.
P.B. నం. 1267 ఫోన్: 22099

హాయిగా ఉండనీయదు, జీవితం అంతా కుళ్ళి, కుళ్ళి చావమంటుంది. ఆ 'లా' ప్రకారమే మీ వృత్తి ధర్మాలు కూడా మారుతుంటాయి. ఇవ్వాళ ఎవ్వరేనా మీ దగ్గరికి ఎబార్షన్ చెయ్యమనివస్తే మానవత్వం అంటారు. ఇంకో ప్రాణిని చంపే హక్కు లేదని పొమ్మంటారు. రేపే 'లా' చెయ్యొచ్చంటే 'ఫీజు తెండి చేస్తాం' అంటారు. అలాగే ఉన్న వాళ్ళకి జాగా చాలదని 'లా' ప్రకారం ఆత్మహత్యలు చేసుకోవచ్చంటే మీ ఈ నీతులన్నీ ఆత్మహత్య వల్ల కలిగే లాభాల వేపు మళ్ళిస్తారు.

ఇదంతా మీ దృష్టిలో వెఱ్ఱి ధోరణే కావచ్చు. కాని ఇప్పుడు మీరేం అనుకున్నా భయంలేదు. మీ హాస్పిటల్‌లోంచి డిస్చార్జి చేయబడి నలుగురి దృష్టిలో పడి నాలుగు మాటలు అనిపించుకున్నప్పుడే లేనిభయం ఇంకొద్ది గంటల్లో చావబోతున్న నాకుఇంకేం భయం? చచ్చేముందర నా బాధలు ఎవ్వరితోనైనా చెప్దామనుకున్నాను. కాని వెఱ్ఱి ధోరణి కింద తోసిపారేస్తారని మీతో కూడా చెప్పుకోడానికి భయపడ్డాను. చచ్చిన తరువాత ఎవ్వరికైనా ఆ మాత్రం సానుభూతి వుంటుంది. కాబట్టి మీరు ఓపిగ్గా నేను పడ్డ అవస్థలు, బాధలు చదువుతారనే నమ్మకంతో రాస్తున్నాను.

నేను పుట్టినప్పుడు నోట్లో వెండి చెంచాతో పుట్టలేదుకాని డబ్బున్న కుటుంబంలోనే పుట్టాను. ముగ్గురు మగపిల్లల తర్వాత నేనొక్కర్తెనే ఆడపిల్లనని కథల్లోలా నంగిరి, పింగిరిగా పెంచకపోయినా అందరూ అభిమానంగానే చూసుకొనేవారు. కాలేజీలో మిస్ కాలేజిని కాకపోయినా నా వెంట ఎప్పుడూ నలుగురయిదుగురు స్టూడెంట్స్ వెంటపడ్తూ నన్ను ఇంటిదాకా జాగ్రత్తగా దిగబెట్టేవారు. మాది కొంత మంచి పేరున్న కుటుంబమే కావడంచేత నాకుమంచి సంబంధమే వచ్చింది.


పెళ్ళయిన రెండేళ్ళూ నా సంసార యాత్ర బాగానే సాగింది. కాని ఆ యాత్ర రెండేళ్ళలోనే నా భర్త మరణంతో ఆగిపోయింది. నిరాశతో బయల్దేరిన చోటుకే చేరుకున్నట్టుగా నాఇంటికి నేను చేరుకున్నాను. మొదట నా భర్త మంచితనాన్ని, నా దురదృష్టాన్నీ తలచుకొని ఏడవడంతోనే సరిపోయింది. నాతోటి వాళ్ళందరు సరదాగా తమ భర్తలతో తిరుగుతుంటే నాకు ఈర్ష్యగా, దుఃఖంగా ఉండేది. రాను, రాను మావదినలు మా అన్నయ్యలతో సరదాగా ఉన్నా భరించలేనంత స్థితి వచ్చింది.

నా జీవితంలో ప్రయాణించవలసిన దూరం చాలా ఉంది

పోయింది. 'వాకిలిదాటి వారణా సెక్కడ' అని రెండేళ్ళ జీవితాన్నే నెమరు వేసుకుంటూ ఇంత దూరం ఒంటరిగా ప్రయాణించలేనేమోనని పించింది.

మగతోడు అవసరం అనిపించింది. రెండో పెళ్ళి చేసుకుంటే కాని మొదటి పెళ్ళికి జరిగిన కష్టాన్ని, నష్టాన్ని భరించలేనేమోనని పించింది. పిల్లలైనా వుండివుంటే ఈ ఆలోచనలేవీలేక వాళ్ళని చూసుకుంటూ నా బ్రతుకు హాయిగా గడిచిపోయేదేమో! నేను రెండోపెళ్ళికి సిద్ధంగా ఉన్నా నన్నెవరు చేసుకుంటారని భయపడ్డాను. ఇలాంటివాట్లో అమాయకులు తెగించినంతగా త్యాగాలు, ఆదర్శాలు అని పెద్దగా వాగే మీలాంటివాళ్ళు తెగించలేరని, కాలేజీ జీవితంలో నేను చూసిన సంఘటనలు నాకు మాత్రం తెలివినిచ్చాయి. అందుకే మా యింటికెదురుగా లాడ్జిలో వుండి చదువుకుంటున్న ఒక అమాయకపు బ్రహ్మచారిపై నా వలను విసిరేను.

ఆడది తేరిపారచూస్తే తలవాచేను కొనేంత భయస్థుడు కావడంవల్ల నేను చాలా వేషాలు వెయ్యవలసి వచ్చింది. అతన్ని ఆకర్షించడానికి నేను చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇంట్లో ఎవ్వరూ లేనప్పుడు గంటల తరబడి మాట్లాడుకొనేవాళ్ళం. అప్పుడప్పుడూ షికార్లకి కూడా పోయేవాళ్ళం. నా జాగ్రత్తలో నేను ఉంటూ పెళ్ళికికూడా ఒప్పించగలిగేను. మొదట అతనితో లేచిపోయి ఎక్కడైనా పెళ్ళి చేసుకుందా మనుకున్నాను, కాని మా అన్నయ్యలకి, వదినలకి అనవసరంగా భయపడి పోతున్నా ననుకున్నాను. నా గురించి వాళ్ళుబాధపడి పోతున్న తీరు, చూపే సానుభూతి, అభిమానం అంతాచూసి నా రెండో పెళ్ళికి అభ్యంతరం చెప్పేంత సంకుచిత స్వభావులు కారనుకున్నాను. అక్కడే నేను పెద్ద పొరపాటు చేశాను. ఆడదానికి సహజంగా వుండే (అందులో రెండో పెళ్ళికి) సిగ్గు కూడా వదులుకొని నా పెళ్ళి విషయం ప్రస్తావించాను. నేనింత బరితెగిస్తానని వారనుకున్నట్లుగా లేదు. ఆశ్చర్యంతోనో, భయంతోనో మొదట ఎవరి నోటంటా మాట రాలేదు. తరువాత నెత్తిమీద ఆటం బాంబు పడిపోతున్నంత అట్టహాసం చేశారు. కుటుంబం పరువు, ప్రతిష్ఠలను మంటగలుపుతున్నా నన్నారు, తండ్రిపేరును నాశనం చేసేస్తున్నా నన్నారు. మంచిదని కొంచెం స్వేచ్ఛనిస్తే నేనింతపని చేస్తానని వారు కలలోకూడా అనుకోలేదన్నారు. తరువాత నా బతుకు కుక్కబతుకే. ఎదురుగా లాడ్జిలో ఉన్నవాణ్ణి గది ఖాళీ చేయించారు. నామీద వదినలు స్కాట్‌లాండ్‌యార్డు పోలీస్




కన్నా ఎక్కువ నిఘా వేశారు. ఎక్కడికైనా వెళ్తే నన్ను వాళ్ళతో తీసికెళ్ళేవారు. లేకపోతేఇంట్లో పెట్టి మా హాస్పిటల్ లో వెర్రివాళ్ళు పారిపోకుండా వార్డులికి వేసేంత పెద్ద తాళం వేసేవారు. మొదట్లో చచ్చిన తండి తాలూకు పేరు ప్రఖ్యాతులకే ఈ పాట్లన్నీ పడుతున్నా రనుకున్నాను.


కాని నిజం తెలుసుకోడానికి ఎక్కువ రోజులు పట్టలేదు: ఇదంతా నా భర్తపోయిన తరువాత నాతో వచ్చిన ఆస్తిమీద మోజే కాని తండి తాలూకు పరువు, ప్రతిష్ఠలమీద, పేరు ప్రఖ్యాతుల మీదా కాదని. నా ఆస్తిని అంటిపెట్టుకోడానికి ఎవ్వరూ విరగ్గొట్టలేని అడ్డుగోడలే వేశారు. లోకంలో ప్రతివాడికీ అమాత్రం స్వార్థం వుంటుంది. కాని ఒకప్పుడు ఎంతో అభిమానంగా చూసుకున్న స్వంత చెల్లెలిపట్లకూడా ఇంతస్వార్థంచూపే వాళ్ళు ఉంటారనుకోను. నాశనమైపోయినా నా జీవితంమీద ఒక నయాపైసాయైనా సానుభూతి లేనివాళ్ళని – అన్నయ్యలైనా అంటి పెట్టుకొని వుండటంలో అర్థం లేదనిపించింది. నన్నా మాత్రం ఆదరించి సానుభూతితో అండగా నిలిచే మగాడెవడైనా, కనీసం గిరీశం లాంటివాడైనా దొరికితే ఈ ముళ్ళ కంచెల్లోంచి దాటిపోదా మనిపించింది.

కాని నామీదవున్న నిఘాతో అది అసాధ్య మనిపించింది. ఓనాడు

మా ఆయనకి వరసకితమ్ముడు, నాకు మఱది అయ్యేచుట్టం మా యింట్లో దిగితే నా కష్టాల్లో ఆదుకోడానికి దేవుడే పంపించినంత సంతోషం కలిగింది. దిగగానే నన్ను పలకరించేడు ఎలాగున్నావని. మా ఆయన బతికున్న రోజుల్లో అతను రోజూ మా యింటికొచ్చేవాడు, మా ఆయన ఇంట్లో లేకపోతే నాతోటే గంటల తరబడి మాట్లాడుతూ కూర్చునేవాడు. ఇప్పటికీ ఇంకా పెళ్ళి చేసుకోలేదని మాటల సందర్భంలో తెలుసుకున్నాను. వీలుచిక్కితే నా బాధంతా చెప్పుకొని ఈ బందిఖానానుంచి ముక్తి పొందుదామనుకున్నాను. కాని వచ్చినచుట్టం రెండు రోజులైనా ఉండకపోడంచేత తగిన అవకాశం దొరకలేదు. అతికష్టంమీద అతని ఎడ్రస్ సంపాదించుకోగలిగేను. ఎడారిలో ఒయాసిస్‌లాగా ఇతను నా దృష్టిలో పడ్డాడు. దొరికిన ఒకకొమ్మ ఆసరాని వదులుకోకూడదనుకున్నాను. నా కష్టాలు, గోడూ అంతా విన్నాక ఆ మాత్రం ఆదరించడా అనిపించింది.

అందుకే రాత్రికిరాత్రి ఇంట్లోంచి పారిపోయాను. అతనిల్లు కనుక్కోడం అంతకష్టం కాలేదు. అతన్ని సులభంగానే కలుసుకున్నాను. పూర్వంవున్న పరిచయంవల్ల నాకు జీవితంలో జరిగిన అన్యాయాలన్నీ చెప్పుకున్నాను. ప్రేమించేవని అబద్ధం ఆడాను. పెళ్ళాడమని కోరేను. అతను వేటికీ సమాధానంచెప్పలేదు. సానుభూతి చూపించినట్టే కనపడ్డాడు. నా కష్టాలు తీరేయనే భావించాను. 'ఇప్పుడేవస్తాను, ఇల్లు జాగ్రత్తగా చూసుకో' అనగానే చెప్పలేనంత ఆనందం కలిగింది. ఏ గంటకో, రెండు గంటలకో వస్తాడనుకున్నవాడు రెండురోజుల తరువాత మా అన్నయ్యలతో నా ఎదురుగా ప్రత్యక్షమయ్యేసరికి నాకు మతిపోయినంత పనయింది. (తరువాత మీ శాస్త్రప్రకారం పోయింది కూడా) సరదాగా మాట్లాడి, మంచిగా కనపడే ఇతనేనా ఇంత కర్కోటకుడనిపించింది. ఇతనికన్నా అన్నయ్యలు, వదినలే నయం అనుకున్నాను. అన్నయ్యలు అతని దగ్గర ఏమీ అనలేదు, అతనికి థాంక్సుచెప్పి నన్ను యింటికి తీసుకువెళ్ళారు.

ఇంటికి వెళ్ళిన తరువాత కలలోకూడా ఊహించని సంఘటనలు జరిగాయి. చెయ్యవేస్తే కంది పోతానని ఒకప్పుడు అపురూపంగా చూసుకునే అన్నయ్యలు చితకతన్నేరు. వదినలు చెయ్యి చేసుకోలేదుకాని అంతకన్నా బాధించే తిట్లు తిట్టారు. ఈ దెబ్బలు, తిట్లూకన్నా వీళ్ళ చదువులు, సంస్కారాలు డబ్బుదగ్గర ఎందుకూ పనికి రాకుండా పోయేయన్న బాధతోనే




ఎక్కువ విచారించానేమో? ఇప్పుడు చెప్పండి నన్నేం చూసి బతకమంటారో?

పెళ్ళాడిన భర్త ఏనాడో పోయాడు. నన్ను మళ్ళా పెళ్ళాడు తానని ముందుకు వచ్చిన అమాయక యువకుణ్ణి గెంటేశారు. నన్నెదో ఆదరిస్తాడని అన్నింటికీ తెగించి పారిపోయి ఆశ్రయం కోరితే అన్నయ్యలకి అప్పజెప్పాడు ఆ మహానుభావుడు.

నాకోసం ప్రాణం ఇవ్వటానికూడా సిద్ధం అనుకొన్న అన్నయ్యలు నన్ను చితకతన్నారు. తోటి ఆడదాన్నర్థం చేసుకోగల రనుకున్న వదినలు తిట్టితిట్టి, దెబ్బలే నయమనిపించారు. రోడ్డుమీద ఆడది వెళ్తే నోరూ, కళ్ళూ వెళ్ళబెట్టుకొని చూసే ఇంతమంది మగాళ్ళు ఒక్క ఆడదానికి ఆశ్రయం ఇవ్వలేని పిరికిపందలని తెలుసుకొనేసరికి చాలా ఆలస్యం అయింది. ఆ పిరికిపందల్లో మిమ్మల్ని పూర్తిగా జమకట్టొచ్చు.

మానవత్వం అన్నారు, త్యాగాలన్నారు, చేతనైతే ప్రాణాలకు కూడా తెగించినట్టుగా మాట్లాడారు. తీరా నన్ను పెళ్లాడమనేసరికి మీ బండారం బయటపడింది. అబద్ధాలు చెప్పడంకూడా చేతకాదనిపించుకున్నారు. నోటికొచ్చిన అబద్ధాలాడ్డానికూడా చాలా సమయం తీసుకొన్నారు. ఎంతసమయం తీసుకొన్నా మొహంలో భయం, మాటల్లో వణుకు దాచుకోలేక




పోయేరు. నిజం అని నమ్మినట్టుగా నేనె మీకన్నా బాగా నటించేనేమో? (నటించడానికి అంత కష్టపడవలసిన అవసరం లేకపోయింది. ఏమంటే అంతకుముందర, తరువాత కూడా అంతకన్నా పెద్దనటనలే చేశాను.)

మీరు నాతో పడ్డపాట్లు చూశాక, మిమ్మల్ని మరీ బాధ పెట్టడం ఇష్టంలేకపోయింది. చేతలకన్నా మాటలుచెప్పేవాళ్ళే ఎక్కువన్న సత్యం అందరికీ తెలిసిందే. అయినా అది మీతో బాగా రుజువయింది. మళ్లా ఆత్మహత్యే శరణ్యం అనిపించింది. కాని ఈసారికూడా తెలివితక్కువగా ప్రయత్నిస్తే జీవితాంతం మీ హాస్పిటల్‌లోనే ఉండిపోవాలేమో అన్న భయం కల్గింది. అందుకే ఆరోజునుంచి సంతోషంగా ఉన్నట్టుగా నటించేను. ఆత్మహత్యకి విరుద్ధంగా నేనే ఎక్కువ ఉపన్యాసాలిచ్చేదాన్ని: లేకపోతే మీ హాస్పిటల్ వాళ్ళు, మా ఇంటివాళ్ళు నన్ను హాయిగా చావనివ్వరని. నా ప్రయత్నాలుఫలించాయి. మీసూపరింటెండెంట్ గారు మీ రిచ్చిన చికిత్సకి, చెప్పిన నీతులకి తెగ మెచ్చుకుంటూ నన్ను డిస్చార్జ్ చేశారు

ట్రీట్‌మెంట్ ఎలా ఉన్నా మీ హాస్పటల్‌లో జాయిన్‌చేసి నాకో మహోపకారం చేశారు. డిస్చార్జ్ అయిన తరువాత బాగయిపోయానని నామీద కోపలా తగ్గింది. ఈ సారి నా ఆత్మహత్యా ప్రయత్నం దిగ్విజయంగా కొనసాగుతుంది. మీరు నన్ను బాగుచేశానుకొని పదిమందితో గర్వంగా చెప్పుకొనే లోపలే నా చావువార్త మీకందొచ్చు.

ఇది మీ కాశ్చర్యంగా ఉంది కదూ! ఫీజు ఇవ్వడంలో మోసపుచ్చే పేషెంట్లని చాలామందిని చూసి ఉంటారు. కాని, రోగాల్లో కూడా మోసంచేసే పేషెంట్లని చూడ్డం మీకిదే మొదటిసారేమో? ఆత్మహత్య మహాపాతకం అంటారు కదూ, కాని ఈ వెధవ బతుకుకన్నా ఆ మహాపాతకమే ఎన్నోరెట్లు నయమనిపిస్తోంది.

నాదిమీ రెన్నటికీ మరువలేని కేసు.

మోసపోయానని మరీ అంత విచారించరన్న ఆశతో,

జయలక్ష్మి.'

ఉత్తరం పూర్తిచేసిన తరువాత అనుకోని పరిస్థితుల్లో ఓ పెద్ద పొరపాటు జరిగిపోయినందుకు చాలా బాధకలిగింది. ఆ బాధతో నే జయలక్ష్మిని డిస్చార్జ్ చేశారని విన్నాక డైరీలో రాసుకున్న వి మళ్లా చదువుకున్నాను.

'జయలక్ష్మి తన్ను తనే మోసం చేసుకుంది. డిస్చార్జ్ చెయ్యడంలో సూపరింటెండెంట్ గారు తొందర పడ్డారేమో? జయలక్ష్మి ఆత్మహత్యా ప్రయత్నంలో కేవలం గడువు పొడిగించడమే సాధ్యం కాని, విరమింపచెయ్యడం అన్నది అసాధ్యమేమో?'

చదవడం పూర్తిచేసి తలఎత్తేసరికి ఏదో చెప్దామని రంగప్ప చాలా సేప్పై నిల్చున్నట్టు వుంది. చెప్పమన్నట్టు చూశాను. 'దొరగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు సార్, కారు కూడా పంపించేరు, కొత్త కేసేదో వచ్చినట్టువుంది. అన్నట్టు మీకీసంగతి తెలుసా, సార్? డిస్చార్జ్ చేసిన ఆ బి. ఏ. అమ్మాయి ఆత్మహత్య చేసుకొని చనిపోయిందిట, వాళ్ళన్నయ్య దొరగారితో చెప్తుంటే విన్నాను' అని రంగప్ప వెళ్తుంటే, ఇదికూడా కొంపతీసి ఆత్మహత్యలో ఫెయిలయిన కేసు కాదుకదా అని అనుకుంటూ రంగప్ప వెనకాతే బయల్దేరాను మళ్ళీ డ్రస్ అయినా మార్చుకోకుండా!

□□□